ప్రతి నెలా నివేదికలు అందించాలి

క్రాంతి, కలెక్టర్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 21: జిల్లాలో ప్రత్యేక అధికారుల పర్యటన నివేదికలు ప్రతి నెలా సమర్పించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని అధికాధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి గ్రామాన్ని విధిగా పర్యటించాలన్నారు. నారాయణఖేడ్ మండలం సంజీవరావుపేటలో కలుషిత నీటితో జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకొని, ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తాగునీటి ట్యాంకులు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. మారుమూల గ్రామాల్లో విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని వసతి గృహాలను విధిగా తనిఖీ చేయాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. పదోతరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు.

బాధిత కుటుంభ సభ్యులకు పరామర్శ

మనూరు, అక్టోబర్ 21: మండల పరిధిలోని తుమ్నూర్ గ్రామానికి చెందిన గంగపురం మాణికయ్య ఇటీవల మరణించడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సోమవారం బాధిత కుంటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్‌రావు, నాయకులు నాగేందర్ రావు, అశోక్‌రెడ్డి, గుండన్న, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, విఠల్‌గొండ ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి

అందోల్, అక్టోబర్ 21: ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతుల నుంచి ధాన్యం కొనాలని జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్ నాగభూషణం అన్నారు. సోమవారం జోగిపేటలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వానకాలం సీజన్ ముగిసి ధాన్యం ఇండ్లకు చేరే సమయం వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ చాలాచోట్ల కొనుగోలు కేంద్రాలు తెరవలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధు ఇవ్వలేదని, పంట రుణమాఫీ సంపూర్ణంగా చేయలేదని మండిపడ్డారు.

అయోడిన్ ఉప్పునే వాడాలి

జహీరాబాద్, అక్టోబర్ 21: అయోడిన్ కలిగిన ఉప్పును వాడటం వల్ల అరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని న్యాల్‌కల్ మండలంలోని మిర్జాపూర్(బి), న్యాల్‌కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు నృపేన్‌చక్రవర్తి, గణపతిరావు అన్నారు. సోమవారం జాతీయ అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినోత్సవంలో భాగంగా ఆయా ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఉపకేంద్రాల్లో వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం నిత్యం వాడే ఉప్పులో అయోడిన్ లేకపోవడంతో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. దీనికోసం ఆయా ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు అయోడిన్ ఉప్పు వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మల్లికార్జున్, మర్తా, ఏఎన్ఎంలు ఉన్నారు.

మట్టా రజితకు టీచర్స్ ఎక్సలెన్సీ అవార్డు

రామచంద్రాపురం, అక్టోబర్ 21: బీహెచ్ఈఎల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న మట్టా రజిత టీచర్స్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు. ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శారద ఎడ్యుకేషన్ సొసైటీ, స్కై లైఫ్ ఫౌండేషన్ సంయుక్తంగా బిర్లా ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రధానోత్సవంలో ఉపాధ్యాయురాలు రజితను ఆయా సంస్థల ప్రతినిధులు సన్మానించి అవార్డు అందజేశారు. ప్రిన్సిపాల్ రాములు, ఉపాధ్యాయులు లావణ్య, యామిని, కవిత తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులను స్మరించుకోవాలి

రామచంద్రాపురం, అక్టోబర్ 21: పోలీసు అమరవీరులను స్మరించుకోవడం అందరి బాధ్యత అని కొల్లూర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంథన్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్, సిబ్బంది పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు.

వృద్ధ దంపతుల అంత్యక్రియల్లో ఎమ్మెల్యే

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం, అక్టోబర్ 21: ఝరాసంగం మండల కేంద్రానికి చెందిన ప్రతాప్‌సింగ్, కళావతి దంపతులు పురుగుల మందు తాగి మరణించిన విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు సోమవారం వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంత్‌రావు పటేల్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జగదీశ్వర్, నాయకులు సంగమేశ్వర్, ఉదయ్ శంకర్ పటేల్, డాక్టర్ నాగరాజ్ ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

జహీరాబాద్, అక్టోబర్ 21: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జహీరాబాద్ పట్టణ సమీపంలోని రంజోల్‌కు చెందిన చాకలి బక్కన్నకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.1.25 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మిన్పూర్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ

మాట్లాడుతున్న సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య

పుల్కల్, అక్టోబర్ 21: మండలంలోని మిన్పూర్‌లో ఇద్దరు వ్యక్తుల మధ్య మొదలైన ఘర్షణ ఇరువర్గాల మధ్య చిచ్చుకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొద్దిరోజుల క్రితం మిన్పూర్ గ్రామంలో ముదిరాజ్‌లకు ఇతర కులాల మధ్య చేపల చెరువుల విషయంలో గొడవలు జరిగాయి. ఈ విషయంలో పలుమార్లు రాజీ కుదిరినా అప్పుడప్పుడూ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. గతంలోనే సీఐ అనీల్‌కుమార్ సమక్షంలో ఒకరి దగ్గరికి ఒకరు వెళ్లవద్దని ఒప్పందపత్రం కూడా రాసుకున్నారు. ఆదివారం రాత్రి ఒక యువకుడు బైక్‌పై వెళ్తున్న క్రమంలో సైడ్‌స్టాండ్ తీయమని చెప్పడంతో జరిగిన గొడవ ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. సమాచారం అందుకున్న పోలీసులు రాత్రికిరాత్రే గ్రామంలో మోహరించారు. సోమవారం ఉదయం వరకు ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా ఎక్కడికక్కడ గస్తీ కాశారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య, జోగిపేట సీఐ అనీల్‌కుమార్, ఫిషరీస్ ఏడీ నర్సింహారావ్, వివిధ మండలాల సీఐలు, ఎస్సైలు సైతం ఆ గ్రామానికి చేరుకున్నారు. అన్ని కులాల పెద్ద మనుషులను పిలిపించి గ్రామస్తుల సమక్షంలో ఇరువర్గాల మధ్య గొడవలు సద్దుమనుగేలా వారికి అర్థమయ్యే రీతిలో వివరించారు. గొడవలు చేసుకొని కోర్టుల చుట్టూ తిరగొద్దని సూచించారు. మళ్లీ ఇలాంటి గొడవలు జరిగితే అందరిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అందోల్ ఆర్డీవో పాండు, పుల్కల్ తహసీల్దార్ కృష్ణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలి

జహీరాబాద్, అక్టోబర్ 21: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని జహీరాబాద్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాబేర్ హుస్సేన్ అన్నారు. మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్ ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో తాగునీటి సహాయకులకు తాగునీటి సరఫరాపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో తాగునీటిని కలుషితం కాకుండా చూడాలని, లీకేజీలు ఉన్న పైపులైన్లకు మరమ్మతులు చేసి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. ప్రతి వారం వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి, నీటిలో బ్లిచింగ్ పౌడర్‌ను కలుపాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్, ఎంపీవో సురేశ్, మిషన్ భగీరథ ఏఈ అజ్జత్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 21: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 4 నుంచి సంగారెడ్డి, వరంగల్‌లో ప్రారంభం కానున్న అండర్-23 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు ఎంపిక కోసం నాలుగు జట్లను సోమవారం సంగారెడ్డిలో ఎంపిక చేశారు. జూబ్లీ క్లబ్ ప్రాంగణంలో ఉన్న ఎంఎస్ అకాడమీలో ఎంపిక ప్రక్రియ కొనసాగింది. ఎంపికకు జిల్లా వ్యాప్తంగా అనేక మంది క్రీడాకారులు హాజరు కాగా, మొత్తం నాలుగు జట్లను ఎంపిక చేశారు. ఆయా జట్ల మధ్య ఈ నెల 22 నుంచి పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తారు. ఈ ఎంపిక కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్ రెడ్డి, సభ్యులు మధుమోహన్‌రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, కోచ్‌లు చంద్రమౌళి, ఇనాం ఉర్ రహమాన్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అత్యధిక బోనస్ సాధించాం

మాట్లాడుతున్న కర్మగార యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

జహీరాబాద్, అక్టోబర్ 21: జహీరాబాద్‌లోని మహీంద్రా అండ్ మహీంద్రా కర్మగారంలో అత్యధిక బోనస్ సాధించినట్లు సీఐటీయూ కర్మగార యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, క్లస్టర్ కన్వీనర్ మహిపాల్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో కార్మికులకు బోనస్ గురించి చర్చించారు. ఈ సంవత్సరం యాజమాన్యం పర్మనెంట్ కార్మికుడికి రూ.1.15,932 బోనస్ ప్రకటించేందుకు సీ ఐటీయూ నాయకులు ప్రత్యేక చొరవచూపారన్నారు. గతేడాది రూ.78,553 బోనస్ ప్రకటిస్తే ఈ సంవత్సరం రూ.1,15,932 బోనస్ సాధించడం సీఐటీయూ విజయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు, కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్మికుల న్యాయపరమైన డిమాండ్లు, సమస్యల సాధన కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సూరి, నవీన్, రాజు, మసి, విజయ్, సాజిద్, మహేశ్, సతీశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

సింగూరు జలాలు జిల్లా ప్రజల హక్కు

మాట్లాడుతున్న జయరాజు, నాయకులు

సంగారెడ్డి, అక్టోబర్ 21: మంజీరా, సింగూరు ప్రాజెక్టుల నీటిని జిల్లా అవసరాలకు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. జహీరాబాద్ పట్టణంలో రెండు రోజులు జరిగిన సీపీఎం మహాసభల్లో 18 రకాల తీర్మానాలు చేసి ఆమోదించినట్లు తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరువయ్యాయని వాపోయారు. కాలుష్యాన్ని కట్టడి చేయడం లేదని ఆరోపించారు. సంగారెడ్డి నుంచి హైదరాబాద్‌కు నిత్యం ప్రజలు, విద్యార్థులు, వ్యాపారస్తులు వేలాదిగా రాకపోకలు సాగిస్తుంటారని, సంగారెడ్డి వరకు మెట్రో సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్, సాయిలు, జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణ ఉన్నారు.

ఘనంగా రోజాబాల్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, మెప్మా ఆర్పీలు

బొల్లారం, అక్టోబర్ 21: బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం బొల్లారంలో ఘనంగా జరుపుకున్నారు. కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆమె ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. మెప్మా ఆర్పీలు ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీటీసీ రత్నం ఉన్నారు.

పీచెర్యాగడి తండాలో భారీ చోరీ

21 తులాల బంగారం.. రూ.18 లక్షలు అపహరణ

పగులగొట్టిన బీరువా తాళాలు

కోహీర్, అక్టోబర్ 21: మండలంలోని పీచెర్యాగడి పాత తండా చెరువు పక్కన ఉన్న దుర్గమ్మ, మైసమ్మ ఆలయ పూజారికి చెందిన భారీ నగదు, నగలను దొంగలు అపహరించారు. ఎస్సై గోపతి సురేశ్ కథనం ప్రకారం.. పీచెర్యాగడి తండాకు చెందిన దుర్గమ్మ, మైసమ్మ ఆలయ పూజారి ఆదివారం సాయంత్రం తన గదికి తాళం వేసి వెళ్లిపోయాడు. రాత్రి పది గంటల వరకు కొంతమంది యువకులు అక్కడ కాపలాగా ఉన్నారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు ఆలయం వద్దకు వచ్చి చూసేసరికి పూజారి గది తలుపులు తెరిచి ఉన్నాయి. లోపల బీరువా కూడా తెరిచి ఉండడంతో దొంగతనం జరిగినట్లు యువకులు గుర్తించారు. 21 తులాల బంగారం, 3,700 గ్రాముల వెండి, రూ.18.20 లక్షల నగదు పోయినట్లు తేలింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీమ్ ఆధ్వర్యంలో ఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం వివరాలను సేకరించారు. పూజారి రమేశ్ మహారాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీరువా తాళాలు పగులగొట్టి దోచుకెళ్లారు

పీచెర్యాగడి తండా చెరువు వద్ద ఉన్న దుర్గమ్మ, మైసమ్మ గుడి లోపలి గదిలోని బీరువాలో దాచిన 21 తులాల బంగారం, 3,700 గ్రాముల వెండి, రూ.18.20 లక్షలు దొంగిలించారు. నా భూమి అమ్మి జహీరాబాద్‌లో ఒక ఇంటిని కొన్నా. ఆ ఇంటిని అమ్మితే వచ్చిన డబ్బులను బీరువాలో దాచాను. కానీ, అన్నీ పోయాయి. పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఎవరూ లేని సమయంలో దొంగతనానికి ఒడిగట్టారు.

– రమేశ్ మహారాజ్, దుర్గమ్మ ఆలయ పూజారి

హిందువుల జోలికొస్తే ఊరుకోం

జిన్నారంలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

జిన్నారం, అక్టోబర్ 21: హిందువుల జోలికొచ్చినా.. హిందూ ఆలయాల జోలికొచ్చినా సహించేది లేదని హిందూ సంఘాలు మండిపడ్డాయి. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ గుడిలో అమ్మవారి విగ్రహం ధ్వంసాన్ని నిరసిస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జిన్నారంలోని హనుమాన్ ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. హిందువుల జోలికొస్తే ఖబడ్దార్.. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం జిన్నారం పోలీస్‌స్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. ముత్యాలమ్మ గుడిలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగన్‌రెడ్డి, నర్సింగ్ రావు, ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, లత, శ్రీనివాస్, రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

సంగారెడ్డి, అక్టోబర్ 21: ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం సంతోషకరమని డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం విద్యార్థులను అభినందించారు. సోమవారం మండల పరిధిలోని ఫసల్‌వాదిలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని సందర్శించారు. రైతులతో వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ముఖాముఖి నిర్వహించి సాగులో మెళకువలు నేర్పించారు. కార్యక్రమంలో అన్నదాత కన్సల్‌టెంట్ సురేశ్‌బాబు, అభ్యుదయ రైతు శ్రీనివాస్ పంతులు, డాక్టర్ అమీర్‌భాషా, ఏరువాక కేంద్రం సమన్వయకర్త రాహుల్, జిల్లా ఉపాధిశాఖ అధికారి నిర్మల, అనిశ్‌వర్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు శ్రీలత, అరుణ, ఎన్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

యాదవ సంఘం యువత విభాగం జిల్లా అధ్యక్షుడిగా సతీశ్‌యాదవ్

హత్నూర, అక్టోబర్ 21: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యువత విభాగం అధ్యక్షుడిగా హత్నూర మండలం దౌలాపూర్ గ్రామానికి చెందిన సతీశ్‌యాదవ్‌ని నియమిస్తూ రాష్ట్ర యువత విభాగం అధ్యక్షుడు యశ్వంత్‌రాజుయాదవ్ సోమవారం నియామకపత్రం అందజేశారు. యాదవ కులస్తుల సమస్యల పరిష్కారం కోసం అఖిలభారత యాదవ మహాసభ ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు సతీశ్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ఆందోళన

జహీరామాద్, అక్టోబర్ 21: తమ డిమాండ్లను నెరవేర్చడంతోపాటు క్లా బ్యాక్ నిబంధనలకు వ్యతిరేకంగా ఎల్ఐసీ ఏజెంట్లు సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎల్ఐసీ పాలసీలపై బోనస్ పెంచి జీఎస్‌టీని రద్దు చేయాలన్నారు. కొత్త పాలసీలపై పెంచిన ప్రీమియంను తగ్గించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించేవరకు ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్పులు వెంటనే చెల్లించాలి

జహీరాబాద్, అక్టోబర్ 21: పెండింగ్ స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రసాద్ సాగర్ డిమాండ్ చేశారు. సోమవారం జహీరాబాద్‌లోని వశిష్ట డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఏఎంసీలకు చైర్మన్ల నియామకం

అందోల్, అక్టోబర్ 21: జోగిపేట, వట్‌పల్లి మార్కెట్ కమిటీలకు కొత్త చైర్మన్లు, వైస్ చైర్మన్లతోపాటు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండల పరిధిలోని నేరడిగుంట గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు మక్త జగన్‌మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా ఎల్లంపల్లి సత్యనారాయణను నియమించింది. మరో 16మందిని డైరెక్టర్లుగా నియమించింది. వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అల్లాదుర్గం మండలం రాంపూర్‌కు చెందిన కొప్పుల లక్ష్మీశేషారెడ్డిని..వైస్ చైర్మన్‌గా మన్నె ఈశ్వరయ్యను నియమించారు. మరో 16 మంది డైరెక్టర్లను నియమించింది. ఈ సందర్భంగా కొత్త చైర్మన్లు జగన్‌మోహన్ రెడ్డి, లక్ష్మీశేషారెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి దామోదరరాజనర్సింహాకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

భారత్-జపాన్ బంధం మరింత బలోపేతం

సంగారెడ్డి అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): భారత్, జపాన్ దేశాల మధ్య దౌత్యసంబంధాలు మెరుగుపడేలా ఇరుదేశాల్లోని విశ్వవిద్యాలయాలు తమవంత పాత్ర పోషిస్తున్నట్లు జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ ప్రెసిడెంట్ డా.కజుహిటో హషిమోటో అన్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో సోమవారం జపాన్ అకడమిక్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి అధ్యక్షత వహించగా జపాన్ సైన్స్‌అండ్‌టెక్నాలజీ ఏజెన్సీ ప్రెసిడెంట్ డా.కజుహిటో హషిమోటో, జపాన్ రాయబార కార్యాలయం ప్రతినిధి అరియోషి తకాషి. జైకా ప్రతినిధి తకేచి తకురో, ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు. జపాన్‌డేలో జపాన్‌కు చెందిన 15 విశ్వవిద్యాలయాలు, ఆరు సంస్థలు పాల్గొన్నాయి. జపాన్‌లోని 15 విశ్వవిద్యాలయాల్లో విద్యాఅవకాశాలు, స్టూడెంట్ ఎక్స్‌ఛేంజ్ ప్రోగ్రాం గురించి జపాన్ విశ్వవిద్యాలయాలు ఐఐటీహెచ్ విద్యార్థులకు వివరించాయి. జపాన్‌కు చెందిన ఆరు కంపెనీలు తమ సంస్థల్లో ఉద్యోగ అవకాశాల గురించి విద్యార్థులకు వివరించటం జరిగింది. జపాన్ అకడమిక్ డే కార్యక్రమంలో పాల్గొన్న జపాన్ సైన్స్‌అండ్ టెక్నాలజీ ఏజెన్సీ ప్రెసిడెంట్ డా.కజుహిటో హషిమోటో మాట్లాడుతూ జైకా సహకారంతో ఐఐటీహెచ్ రెండవ దశ పూర్తి చేయటం ఆనందంగా ఉంది. జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ ద్వారా సాంకేతిక బదలాయింపు, విద్యార్థుల ఎక్స్‌చేంజ్ మరింత ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. జపాన్‌కు చెందిన విశ్వవిద్యాలయాలు, సంస్థలతో కలిసి ఐఐటీహెచ్ పరిశోధనలు చేయటం భారత దేశంకు ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు, టెక్నాలజీ బదలాయింపుతో భారత్, జపాన్ దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నట్లు చెప్పారు. ఐఐటీహెచ్ డైరక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఐఐటీహెచ్‌లో జపాన్ అకడమిక్ డే నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జపాన్ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

అనూష(ఫైల్)

కోహీర్, అక్టోబర్ 21: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిరిపురం అనూష(17) ఆదివారం నారాయణ కళాశాలో ఆత్మహత్య చేసుకొంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిరిపురం లక్ష్మ య్య, అన్నమ్మల రెండో కూతురు అనూష బాచుపల్లిలోని నారాయణ కళాశాలలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నది. దసరా సెలవుల కోసం ఇం టికి రాగా ఆదివారం ఆమె పెదనాన్న రాములు, పెద్దమ్మ లక్ష్మి కలిసి కళాశాలకు పంపించి ఇంటికి తిరుగుపయనమయ్యారు. కాలేజీలోకి సంతోషంగా వెళ్లిన అనూష రెండు గంటల్లోనే ఆత్మహత్య చేసుకొన్నట్లు మరణ వార్త వచ్చింది. సోమవారం సాయంత్రం గాంధీ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. నాగిరెడ్డిపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అనూష మృతితో బంధువులు, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. అనూష అక్కకు వివాహం కాగా, చెల్లి దిగ్వాల్ జీఎంఆర్‌లో పదో తరగతి చదువుతున్నది.

అపూర్వ సమ్మేళనం

కంది, అక్టోబర్ 21: అపూర్వ సమ్మేళనంలో కంది ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1996-97 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

కమ్ముకున్న పొగమంచు

జహీరాబాద్, అక్టోబర్ 21: మండలంలోని అల్లాదుర్గం-మెటల్‌కుంట, బీదర్-జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులను సోమవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. దారి కనబడక వాహనదారులు కాస్త ఇబ్బంది పడ్డారు. ఎనిమిది గంటల వరకు కూడా సూర్యులు కానరాలేదు. సాయంత్రం ఉన్నట్టుండి మేఘాలు కమ్ముకొని వర్షం దంచికొట్టింది. దీంతో సాగులో ఉన్న పత్తి పంటతోపాటు చేతికి వచ్చిన సోయాబీన్ పంటలు దెబ్బతింట